# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 16-5-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 సంపుటి :29 సంచిక: 214 పేజీలు:6 వెల: రూ.1/-


## 17న తేదీన బీఆర్ఎస్ లెజిస్లేటివ్, పార్లమెంటరీ పార్టీ సమావేశం

హైదరాబాద్ మే 15 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):: తెలంగాణ భవన్‌లో ఈ నెల 17వ తేదీన బీఆర్ఎస్ లెజిస్లేటివ్, పార్లమెంటరీ పార్టీ సమావేశం జరగనుంది. మధ్యాహ్నం 2 గంటలకు సీ

## సీబీఐ చీఫ్ పదవికి కర్ణాటక ఐపీఎస్ అధికారి ఎంపిక?

న్యూఢిల్లీ మే 15 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: కేంద్ర దర్యాప్తు సంస్థ డైరెక్టర్ నియామకానికి కసరత్తు జరుగుతోంది. ఈ ఎంపిక కోసం ఏర్పాటైన అత్యున్నత స్థాయి కమిటీ ముగ్గురు అధికారులతో ఓ జాబితాను రూపొందించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ కమిటీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి ఉన్నారు. శనివారం సాయంత్రం ఈ కమిటీ సమావేశమై, ఈ ముగ్గురు అధికారులను ఎంపిక చేసినట్లు తెలిసింది. సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్, లోక్‌పాల్ సభ్యుడు పదవుల కోసం అభ్యర్థుల ఎంపికపై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది.దుపరి సీబీఐ డైరెక్టర్ పదవి కోసం కర్ణాటక డీజీపీ ప్రవీణ్ సూద్, మధ్య ప్రదేశ్ డీజీపీ సుధీర్ సక్సేనా, తాజ్ హాసన్‌లను ఈ కమిటీ ఎంపిక చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.ప్రస్తుత సీబీఐ డైరెక్టర్ సుబోధ్ కుమార్ జైస్వాల్ రెండేళ్ల పదవీ కాలం మే 25తో ముగుస్తుంది. ఆయన తర్వాత ఈ స్థానంలో నియామకం కోసం ఎంపికైన ముగ్గురిలో ప్రవీణ్ సూద్ ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రవీణ్ 1986 బ్యాచ్ ఐపీఎస్ అధికారి, ప్రస్తుతం కర్ణాటక డీజీపీ. ప్రవీణ్‌పై ఇటీవల కర్ణాటక కాంగ్రెస్ నేత డీకే శివ కుమార్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయన కాంగ్రెస్ నేతలపై కేసులు పెడుతున్నారని, బీజేపీని కాపాడుతున్నారని, ఆయనను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.సీబీఐ డైరెక్టర్ పదవికి ఎంపికైనవారి పదవీ కాలం రెండేళ్లు. ఆ తర్వాత ఐదేళ్ల వరకు పొడిగించే అవకాశం ఉంటుంది.

## వడదెబ్బకు తాళలేక పోలీసు కానిస్టేబుల్ మృతి

మంచిర్యాల మే 15 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: మంచిర్యాల : మంచిర్యాల జిల్లాలో విషాదం నెలకొంది. వడదెబ్బకు తాళలేక పోలీసు కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన రామకృష్ణాపురం పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళ్తే.. మూతే సంతోష్(42) అనే వ్యక్తి రామకృష్ణాపురం పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. అయితే ఆదివారం తన విధులను ముగించుకుని ఇంటికి చేరుకున్నాడు. రాత్రి 10:30 గంటల సమయంలో ఇంట్లోనే కుప్పకూలిపోయాడు. దీంతో ఆ కానిస్టేబుల్‌ను కుటుంబ సభ్యులు లక్సెట్టిపేటకు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి, చనిపోయినట్లు నిర్ధారించారు. వడదెబ్బ కారణంగానే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సంతోష్ 2000 ఏడాదిలో పోలీసు డిపార్ట్‌మెంట్‌లో చేరారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## చిత్తూరులో పట్టాలు తప్పిన డబుల్ డెక్కర్ రైలు

అమరావతి మే 15 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లాలో డబుల్ డెక్కర్ రైలు పట్టాలు తప్పింది. గుడిపల్లి మండలం బిసానత్తం రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఈ ఘటన చోటు చేసుకున్నది. చెన్నై నుంచి బెంగళూరుకు వెళ్తున్న రైలు కర్ణాటక సరిహద్దులోని బిసానత్తం వద్ద పట్టాలు తప్పింది. అయితే, లోకోపైలెట్ అప్రమత్తంగా వ్యవహరించి వెంటనే రైలును నిలిపివేశారు.దాంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది. విషయం తెలుసుకున్న అధికారులు రైలును సరి చేసేందుకు చర్యలు చేపట్టారు. డబుల్ డెక్కర్ రైలు పట్టాలు తప్పడంతో చెన్నై - బెంగళూరు మార్గంలోని పలు రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. బృందావన్ ఎక్స్‌ప్రెస్‌ను కుప్పం స్టేషన్‌కు దగ్గరలో నిలిపివేశారు. బెంగళూరు కంటోన్మెంట్ స్పెషల్ రైలును తమిళనాడులోని జోలారుపేట జంక్షన్‌లో నిలిపివేయగా.. ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.

## ఈనెల 17న పాలిటెక్నిక్ (పాలిసెట్) ఎంట్రెన్స్ పరీక్ష

మెదక్, మే15: (నేటినిజం ప్రతినిధి):ఈనెల 17న పాలిటెక్నిక్ (పాలిసెట్) ఎంట్రెన్స్ పరీక్షమెదక్ జిల్లాలో ఐదు సెంటర్ల ఏర్పాటు... నిమిషం నిబంధన అమలుమెదక్ జిల్లా కో-ఆర్డినేటర్, మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ సువర్ణలతరాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్‌లలోని మూడు సంవత్సరాల ఇంజనీరింగ్, నాన్-ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటుగా, వ్యవసాయ డిప్లొమా, వెటర్నరీ డిప్లొమా ప్రవేశం కోసం ఈనెల 17న పాలిటెక్నిక్ (పాలిసెట్)-2023 పరీక్షను నిర్వహించనున్నట్లు మెదక్ జిల్లా కో-ఆర్డినేటర్, మెదక్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సువర్ణలత సోమవారం తెలిపారు. ఈనెల 17న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మెదక్ జిల్లా వ్యాప్తంగా ఐదు పరీక్ష కేంద్రాల్లో -1, 933 మంది విద్యార్థులు హాజరవుతారని సువర్ణలత తెలిపారు. ఈ పరీక్షలు మెదక్ పట్టణంలోని గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ హౌసింగ్ బోర్డు కాలనీ, సిద్దార్థ ఆదర్శ జూనియర్ కాలేజీ, గీతా జూనియర్ కాలేజీ, సిద్దార్థ మోడల్ హైస్కూళ్ళలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డాక్టర్ సువర్ణలత తెలిపారు. ఈ పరీక్షకు విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి ఒక గంట ముందుగానే ఉదయం 10 గంటలకే అనుమతిస్తారని... విద్యార్థులు అప్పటికే తమ సెంటర్లకు చేరుకొని ఓఎంఆర్ షీట్‌లో రెండువైపులా పూర్తి వివరాలతో సంతకం చేయాల్సి ఉంటుందని సూచించారు. పరీక్ష రాసే విద్యార్థులు తమ వెంట హెచ్‌బీ , 2 బీ బ్లాక్ పెన్సిల్, ఎరేసర్, బ్లూ, బ్లాక్ పెన్నులు తప్పక తీసుకురావాలని నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించరని జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ సువర్ణలత సూచించారు. అలాగే విద్యార్థుల హాల్ టికెట్ మీద ఫొటో రానట్లయితే వారు ఒక పాస్ పోర్టు సైజు ఫొటో, గుర్తింపు కార్డు తీసుకురావాలని... అలాగే పరీక్ష కేంద్రాల్లోకి సెల్?ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువులు అనుమతించబడవని తెలిపారు.

నేటి కందం - నేటికి అందం

కం॥ శీతిక కాంతుల బాపుట
జ్యోతికి సేవల నొసగెడి సదయుల కంద
...
భూలాధిప నాథు ...!!



(మే 16 అంతర్జాతీయ కాంతి దినోత్సవం...)
International Day of Light)

-రాధశ్రీ
సెల్:9494481210

## ఉపాధి, ఉద్యోగ కల్పనతో రాష్ట్రానికి అపార సంపద : మంత్రి కేటీఆర్

హైదరాబాద్, మే15: రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఈ రోజు తెలంగాణకు చరిత్రాత్మక సందర్భమని అన్నారు. మార్చి 2న సీఎం కేసీఆర్ సమక్షంలో ఫాక్స్‌కాన్‌తో ఒప్పందం జరిగిందని గుర్తు చేశారు. రెండు నెలల్లోనే కంపెనీకి భూమి పూజ చేసుకున్నాం. ఇక్కడి వేగం, సమర్థ నాయకత్వం ఎక్కడా లేదని ఫాక్స్‌కాన్ ప్రతినిధులు చెప్పారన్నారు. తెలంగాణ వేగవంతమైన పనితీరుకు ఇది నిదర్శనమనమని కేటీఆర్ వెల్లడించారు.

దేశంలో ఉన్న ప్రధాన సమస్య ఉపాధి కల్పన అని మంత్రి కేటీఆర్ చెప్పారు. ప్రజలందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం ప్రపంచంలో ఎక్కడా సాధ్యం కాదు. ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వ ఉద్యోగాలు 2 శాతమే ఉంటాయి. స్వయం ఉపాధి, ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కల్పనతో రాష్ట్రానికి అపార సంపద సమకూరుతుందన్నారు.

ఫాక్స్‌కాన్ రంగారెడ్డి జిల్లాకు రావడం మనందరికీ గర్వకారణమని కేటీఆర్ పేర్కొన్నారు. రానున్న ఐదేండ్లలో కొంగరకలాన్ గుర్తు పట్టలేనంతగా మారబోతున్నదని చెప్పారు. రూ. 4 వేల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఫాక్స్‌కాన్ పరిశ్రమతో 35 వేల మందికి ఉద్యోగాలు వస్తాయి. వచ్చిన పరిశ్రమలను కడుపులో పెట్టుకొని కాపాడుకోవాలి. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఇస్తామని ఫాక్స్‌కాన్ హామీ ఇచ్చింది. అటు కంపెనీ నిర్మాణం జరుగుతుంటే మరోవైపు యువతకు శిక్షణ ఇస్తామన్నారు. యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని కేటీఆర్ ప్రకటించారు.

రాష్ట్రంగా ఏర్పడిన 9 ఏండ్లలోనే దేశ స్థాయిలో తెలంగాణ అందరి మన్ననలు పొందుతున్నదని చెప్పారు. తెలంగాణలోని ఏ రంగాన్ని తీసుకున్నా దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని చెప్పారు. చిన్న రాష్ట్రమైనా 30 శాతం కంటే అధిక అవార్డులను సాధించిందన్నారు. దేశంలోనే స్వచ్ఛ సర్వేక్షణ్‌లోని 26 అవార్డులు మన రాష్ట్రం సాధించిందని వెల్లడించారు. ఓ వైపు ఐటీ రంగం.. మరోవైపు వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ఇంటింటికీ నల్లా ద్వారా మంచి నీళ్లు ఇచ్చిన తొలి రాష్ట్రం తెలంగాణ. కేంద్రప్రభుత్వం రాష్ట్ర పథకాలను కాపీ కొడుతున్నదని ఎద్దేవా చేశారు. మన మిషన్ భగీరథ చూసి.. కేంద్ర హర్ ఘర్ జల్ పెట్టిందని కేటీఆర్ గుర్తు చేశారు.

## కొంగరకలాన్‌లో ఫాక్స్‌కాన్ ప్లాంట్‌కు మంత్రి కేటీఆర్ భూమి పూజ




హైదరాబాద్, మే15:రంగారెడ్డి జిల్లాలోని కొంగరకలాన్‌లో ఏర్పాటు చేస్తున్న ఫాక్స్‌కాన్ టెక్నాలజీస్ ప్లాంట్‌కు మంత్రి కేటీఆర్ భూమిపూజ చేశారు. పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం 196 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. సుమారు రూ.1,656 (200 మిలియన్ డాలర్లు) కోట్లకుపైగా పెట్టుబడితో ఫాక్స్‌కాన్ ఇక్కడ తయారీ కేంద్రానికి మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్‌లియూతో కలిసి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఇందులో దాదాపు 35 వేల మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి.

మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీలో ప్రపంచంలోనే అత్యంత ప్రఖ్యాతిగాంచిన సంస్థ ఫాక్స్‌కాన్. సుమారు 70 శాతం యాపిల్ ఐఫోన్లను ఫాక్స్‌కాన్ కంపెనీయే తయారు చేస్తున్నది. యాపిల్ సంస్థ నుంచి ఇప్పటికే ఫాక్స్‌కాన్‌కు భారీ ఆర్డర్ రావడంతో వచ్చే ఏడాది చివరికల్లా ఉత్పత్తి ప్రారంభించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకొన్నది. యాపిల్ కంపెనీ ఎయిర్‌పాడ్‌లు, వైర్‌లెస్ ఇయర్‌ఫోన్ల తయారీ ఆర్డర్‌ను ఫాక్స్‌కాన్‌కు అప్పగించింది. ఇప్పటివరకూ మొబైల్ ఫోన్ల తయారీకే ప్రాధాన్యమిచ్చిన ఫాక్స్‌కాన్, ఇప్పుడు ఎయిర్‌పాడ్‌ల తయారీలోకి అడుగు పెడుతున్నది. ఇటీవలే ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్‌లూ నేతృత్వంలోని కంపెనీ ప్రతినిధిబృందం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుతో సమావేశమై పరిశ్రమ ఏర్పాటుపై చర్చించిన విషయం తెలిసిందే.

## తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని గ్రీవెన్స్‌లో వినతి పత్రాన్ని అందజేసిన నిర్మల జగ్గారెడ్డి



సంగారెడ్డి, మే 15 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణలో అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని సోమవారం జరిగిన గ్రీవెన్స్ లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి అడిషనల్ కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో అకాల వర్షాల వల్ల రైతులు ఎంతో నష్టపోయి రోడ్డు మీద పడ్డారని నిర్మల జగ్గారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వారి ధాన్యం, మొక్కజొన్న, పత్తి, మామిడి ఇలా ఎన్నో పంటలు నష్టపోయారు అని అన్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉండాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ తరఫున వినతిపత్నాన్ని అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో తోపాజి అనంత కిషన్, బుచ్చి రాములు, కూన సంతోష్, సునీల్, ప్రవీణ్, కరుణాకర్, ప్రకాష్, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యక్తిని ప్రాణాలతో కాపాడిన ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు రాచకొండ సీపీ అభినందన

హైదరాబాద్, మే15:ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా, అతన్ని ప్రాణాలతో కాపాడిన ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అభినందించారు.

ఈ నెల 13వ తేదీన సాయంత్రం 6 గంటల సమయంలో ఎల్‌బీనగర్ ట్రాఫిక్ కానిస్టేబుల్ టీ సతీశ్ విజయవాడ బస్టాప్ వద్ద విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే అక్కడున్న ఫ్లై ఓవర్‌పై ఓ వ్యక్తి కూర్చొని ఉన్నాడు. ఫ్లై ఓవర్‌పై నుంచి కిందకు దూకే ప్రయత్నం చేయగా, ప్రయివేటు ఉద్యోగి జాన్సన్ గమనించి, ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను అప్రమత్తం చేశాడు. ఇక ట్రాఫిక్ కానిస్టేబుల్, జాన్సన్ కలిసి.. ఆ వ్యక్తిని మాటల్లో పెట్టారు. ట్రాఫిక్ కానిస్టేబుల్ చాకచక్యంగా వ్యవహరించి, ఆ వ్యక్తి తువాల్‌ను గట్టిగా పట్టుకుని కిందకు లాగారు. దీంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడు. అనంతరం బాధిత వ్యక్తిని పోలీసులకు అప్పగించారు. బాధితుడిని జార్ఖండ్‌కు చెందిన మాంగ్ర(35)గా పోలీసులు గుర్తించా రు. ఆర్థిక సమస్యలు వెంటాడుతుం డటంతో.. ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించినట్లు బాధితుడు పోలీసులకు తెలిపాడు. మాంగ్రను ప్రాణాలతో కాపాడిన కానిస్టేబుల్ టీ సతీష్‌ను రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అభినందించి, రివార్డు అందజేశారు.

## ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులు

కామారెడ్డి జిల్లా, 15 మే, 23 (నేటి నిజం ప్రజాప్రతినిధి):ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను ఆన్లైన్లో నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డిపిఓ శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడి దయానంద్, జిల్లా ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు సాయి భుజంగరావు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు. వివిధ శాఖల వారికి వచ్చిన ఫిర్యాదుల వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ 23ఎంప్లాయిమెంట్ 2 డి ఎం హెచ్ ఓ2 డిపిఓ 10మున్సిపల్ 2 ఎస్సీ డెవలప్మెంట్ 1 ఎస్సీ ఓపిసి 3 సర్వే మరియు ల్యాండ్ రికార్డ్స్ 1మొత్తం 44 ఫిర్యాదులు వచ్చినాయి.

## ఫాక్స్ కాన్ టెక్నాలజీస్ ప్లాంట్‌కు మంత్రి కేటీఆర్ భూమిపూజ

హైదరాబాద్ మే 15 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: రంగారెడ్డి జిల్లాలోని కొంగరకలాన్‌లో ఏర్పాటు చేస్తున్న ఫాక్స్ కాన్ టెక్నాలజీస్ ప్లాంట్‌కు మంత్రి కేటీఆర్ భూమిపూజ చేశారు. పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం 196 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. సుమారు రూ. 1,656 (200 మిలియన్ డాలర్లు) కోట్లకుపైగా పెట్టుబడితో ఫాక్స్‌కాన్ ఇక్కడ తయారీ కేంద్రానికి మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్‌లియూతో కలిసి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఇందులో దాదాపు 35 వేల మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి.మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీలో ప్రపంచంలోనే అత్యంత ప్రఖ్యాతిగాంచిన సంస్థ ఫాక్స్‌కాన్. సుమారు 70 శాతం యాపిల్ ఐఫోన్లను ఫాక్స్‌కాన్ కంపెనీయే తయారు చేస్తున్నది. యాపిల్ సంస్థ నుంచి ఇప్పటికే ఫాక్స్‌కాన్‌కు భారీ ఆర్డర్ రావడంతో వచ్చే ఏడాది చివరికల్లా ఉత్పత్తి ప్రారంభించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకొన్నది. యాపిల్ కంపెనీ ఎయిర్‌పాడ్‌లు, వైర్‌లెస్ ఇయర్‌ఫోన్ల తయారీ ఆర్డర్‌ను ఫాక్స్‌కాన్‌కు అప్పగించింది. ఇప్పటివరకూ మొబైల్ ఫోన్ల తయారీకే ప్రాధాన్యమిచ్చిన ఫాక్స్‌కాన్, ఇప్పుడు ఎయిర్‌పాడ్‌ల తయారీలోకి అడుగు పెడుతున్నది. ఇటీవలే ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్‌లూ నేతృత్వంలోని కంపెనీ ప్రతినిధిబృందం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుతో సమావేశమై పరిశ్రమ ఏర్పాటుపై చర్చించిన విషయం తెలిసిందే.

## ఒక కోటి నిధులతో అగ్రహారం శ్రీ హనుమాన్ దేవాలయ అభివృద్ధి

-ఎమ్మెల్యే రమేష్ బాబు

-14 మందితో నూతన రెనోవేషన్ కమిటీ ప్రమాణ స్వీకారం



రాజన్న సిరిసిల్ల నేటి నిజం ప్రతినిధి 15: ఒక కోటి నిధులతో అగ్రహారం శ్రీ హనుమాన్ దేవాలయ అభివృద్ధి ఎమ్మెల్యే రమేష్ బాబు పేర్కొన్నారు. సోమవారం 14 మందితో కూడిన ఆలయ నూతన రెనోవేషన్ కమిటీ ప్రమాణ స్వీకారంకు శాసనసభ్యులు చెన్నమనేని రమేష్ బాబు, జిల్లా పరిషత్ చైర్మన్ అరుణ, జిల్లా పార్టీ అధ్యక్షులు తోట ఆగయ్య, జెడ్పీటీసీ మ్యాకల రవి, యాస వాణి, ఎంపీపీలు బూర వజ్రవ్వ, చంద్రయ్య గౌడ్, సెస్ డైరక్టర్లు చరణ్ రావు, దేవరాజం, పొన్నాల శ్రీనివాస రావు, పట్టణ కౌన్సిలర్స్, పాక్స్ చైర్మన్లు, మార్కెట్ కమిటీల చైర్మన్లు, మండల పార్టీ అధ్యక్షులు, యితర ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ బాబు మాట్లాడుతూమంత్రి కేటీఆర్, ఇంద్రకరణ్ రెడ్డిల నుండి అలయాభివృద్ధికి కోటి నిధులు ఆమోదం పొందినట్లు తెలిపారు.

చిన్న కొండగట్టుగా అగ్రహారం దేవస్థానం వెలుగొందుతుందన్నారు.

దేవాలయానికి రెన్నోవేషన్ కమిటీని ఆమోదించిన మంత్రి కేటీఆర్ కి, ఇంద్రకరణ్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. రెనోవేషన్ కమిటీ సభ్యులు మాట్లాడుతూదేవునికి, భక్తులకు సేవ చేయడం ఎంతో అదృష్టమని, సమిష్టిగా ఆలయ అభివృద్ధికి ముందుంటామన్నారు. ఈ ఆలయాన్ని ఇక్కడి దేవాలయానికి ఎక్కడ నుంచో కూడా భక్తులు వస్తుంటారని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని, ఆలయ ముందు భాగం సీసీజ్ షెడ్డుల నిర్మాణాలకు నిధులు మంజూరీ చేస్తామని తెలిపారు. ఈ ఆలయాన్ని చిన్న కొండగట్టుగా తీర్చి దిద్దుతామని తెలిపారు. ఆలయ ఆవరణలో తన నిధుల నుండి రు. 7 లక్షలతో ఒక వారంలో ఆర్.వో ప్లాంట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

రెనోవేషన్ కమిటీ సభ్యులలో చేపూరి నాగరాజు, పర్వతి భూమేష్ గౌడ్, నేరెళ్ళ భాస్కర్ గౌడ్, వనపట్ల నర్సింహా రెడ్డి, కొమ్మన బోయిన అభిమన్యు, మెర్గు జల, బోయిన శ్రీనివాస్, అరే సత్యనారాయణ, పేరుమాండ్ల రవి చందర్ గౌడ్, జంగిటి సంజీవ్, ఆకుల వెంకటేష్, తాళ్ల పల్లి సత్యనారాయణ, సిద్దం సెట్టి శ్రీనివాస్, కుసుంభ జనార్ధన్ లు వున్నారు.

## 20 లక్షల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన చింతా ప్రభాకర్



సంగారెడ్డి, మే 15, (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలన్నీటిలో సంగారెడ్డి పట్టణాన్ని అభివృద్ధిలో నిలుపుతున్నామని రాష్ట్ర హ్యాండ్లూమ్ టెక్స్టైల్ అభివృద్ధి సంస్థ చైర్మన్ చింత ప్రభాకర్ అన్నారు. సోమవారం నాడు సంగారెడ్డి పట్టణంలో 35 వ వార్డు ప్రశాంత్ నగర్ కాలనీలో 20 లక్షల నిధులతో జరుగుతున్న అభివృద్ధిలో భాగంగా బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఇశ్రితాబాద్ గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణం కోసం ఆ గ్రామ సర్పంచ్ తో కలిసి పనులను ప్రారంభించినట్లు చింత ప్రభాకర్ చెప్పారు. అనంతరం సదాశివపేటలోని మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సంగారెడ్డి, సదాశివపేట, కొండాపూర్, కంది మండలాల లబ్ధిదారులైన పేదలకు అందజేశారు. సంగారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే ముందు ఉంచుతున్నామని ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కార దిశగా అధికారులు కృషి చేయాలి

మెదక్, మే15: (నేటినిజం ప్రతినిధి):ప్రజా సమస్యల పరిష్కార దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణికి అదనపు కలెక్టర్ రమేష్ తో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 68 వినతులు స్వీకరించారు. ఇందులో ప్రధానంగా ధరణి,భూ సమస్యలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించి 38 వినతులు రాగా వివిధ శాఖలకు సంబంధించి మరో 30 వినతులు వచ్చాయి. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజలు సమర్పించే దరఖాస్తులపై అధికారులు ఎక్కువ దృష్టి కేంద్రీకరించి పరిష్కార దిశగా కృషి చేయాలన్నారు. ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కారమయ్యేలా సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయాలని అప్పుడే ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందని అన్నారు. అనంతరం అధికారులతో వివిధ కార్యకమాలను సమీక్షిస్తూ గ్రామ పంచాయతీలకు సంబంధించి బిల్లులు క్లియర్ అయినందున మిగతా పనులు వేగిరం చేయాలన్నారు.

మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం క్రింద అన్ని పనులు మొదలు పెట్టేలా సర్పంచులను, స్కూల్ మేనేజిమెంట్ కమిటీని ప్రోత్సహించాలని అన్నారు . వైకుంఠ ధామాలలో చేతి పంపుల ఏర్పాటు, మోటార్ల బిగింపు, విద్యుత్ సౌకర్యం కల్పించి అన్ని వినియోగంలో తెచ్చేలా జిల్లా పంచాయతీ, విద్యుత్ శాఖాధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అదేవిధంగా మిగిలిపోయినా తెలంగాణాకు క్రీడా ప్రాంగణాలు సత్వరమే ఏర్పాటయ్యేలా చూడాలన్నారు. మండలాలలో ఏర్పాటు చేస్తున్నసమావేశాలల్లో వివిధ పనుల పురోగతిని సమీక్షిస్తూ పనులు పరుగుపెట్టించాలని అన్నారు. ప్రతి మండల ప్రత్యేకాధికారి వారంలో కనీసం రెండు కంటి వెలుగు శిబిరాలను, మంగళ వారం ఆరోగ్య మహిళా కేంద్రాన్ని సందర్శించి మెరుగ్గా శిబిరాలు నిర్వహించేలా పర్యవేక్షించాలన్నారు. సోమవారం నుండి బుధవారం వరకు మండల స్థాయిలో నిర్వహించే సి.ఎం. కప్-2023 విజయవంతానికి కృషిచేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. వానాకాలంలో రైతులకు ఎరువుల కొరత రాకుండా రేక్ పాయింట్ ద్వారా ఎరువుల రవాణా, గోదాములలో భద్రపర్చుటపై పర్యవేక్షణ చేస్తుండాలి జిల్లా వ్యవసాయాధికారి సూచించారు. రైతులు ఎఫ్.ఏ.క్యూ. నిబంధనల మేరకు నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెచ్చేలా వ్యవసాయ విస్తరణాధికారులు అవగాహన కలిగించాలన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు వెంకట శైలేష్, శ్రీనివాస్, జయరాజ్, విజయ శేఖర్ రెడ్డి, కృష్ణ మూర్తి, జెంలా నాయక్, రవి ప్రసాద్, రాధాకిషన్, కమలాకర్, ,సాయిబాబా, శంకర్, రజిని, విజయలక్ష్మి, ఆశా కుమారి, బ్రహ్మాజీ , కరుణ, ఇందిర, డా.నవీన్, ,కలెక్టరేట్ ఏ.ఓ. యూనుస్ తదితరులు పాల్గొన్నారు.

# వసుదైక కుటుంబ సౌభాగ్యానికి మూలాలు కుటుంబాలే..!

(15 మే 'అంతర్జాతీయ కుటుంబ దినం' సందర్భంగా)

భూకుగ్రామానికి పునాదులు కుటుంబాలు. వసుదైక కుటుంబ సౌభాగ్యానికి సకల మూలాలు కుటుంబాలు. అమ్మనాన్నలు, కుటుంబం లేని వారుండరు. కుటుంబం అంటే నాలుగు గోడల నడుమ ఉన్న గదులు కాదు. ప్రేమానురాగాల సిమెంటుతో కట్టిన పొదరిల్లు. కుటుంబం అంటే నవ్వులు, అనుబంధాలు, ఆప్యాయతలు, బాధలు, బాధ్యతలు, హక్కులు, సంతోషాల కుప్పలు, గాయాలకు లేపనాలు, సవాళ్ళకు సమాధానాలు, శారీరక మానసిక వికాస సోపానాలు, కష్టసుఖాల సమతుల్యతలు, అమ్మ లాలనలు, నాన్న నిర్దేశాలు, సమాజాభివృద్ధికి మూల స్తంభాలు.

## డిజిటల్ యుగంలో న్యూక్లియర్ ఫామిలీస్:

నాటి నుంచి నేటి వరకు కుటుంబాలు కాలక్రమంలో పెను మార్పులకు లోనవుతూ ఉన్నప్పటికీ కుటుంబానికి ప్రత్యామ్నాయం లేదు. ఉమ్మడి కుటుంబాలు అంతరిస్తూ న్యూక్లియర్ ఫామిలీలు వెలుస్తున్నాయి. డిజిటల్ యుగంలో కుటుంబం అంటే అమ్మనాన్న, ఒకరిద్దరు పిల్లలుగా కుచించుకు పోయింది. నాన్న నాయకత్వం, అమ్మ అమృత హస్తం నీడన ఎదిగిన పిల్లలు జాతిరత్నాలు అవుతారు. అమ్మనాన్ననలను గౌరవించక, అపహాస్యం చేసే పిల్లలు చరిత్ర హీనులు అవుతారు. ఆది గురువులుగా తల్లితండ్రులు పిల్లల మనసుల్లో మానవీయ విత్తులు నాటుతారు. సంతోషాలతో నిండిన గృహాలు దేశాభివృద్ధికి గీటురాళ్ళు. అస్థిర కుటుంబాలు అశాంతికి నెలవులు. సమాజ దేహానికి కుటుంబాలే అస్థిపంజర పటిష్ట వ్యవస్థలు, కుటుంబ సభ్యులే అవయవాలు.

## సమాజానికి యూనిట్ కుటుంబం:

ఇండియాలో పితృస్వామ్య కుటుంబ వ్యవస్థ నెలకొని ఉంటూ ఆర్థిక స్థితిని బట్టి ధనిక, మధ్య తరగతి, పేదరిక కుటుంబాలుగా వర్గీకరించబడి ఉన్నాయి. ప్రపంచ మానవాళి సమగ్రాభివృద్ధిలో కుటుంబాల ప్రాధాన్యతలను గుర్తించిన ఐక్యరాజ్యసమితి 1994లో 'అంతర్జాతీయ కుటుంబ దినం (ఇంటర్నేషనల్ ఫామిలి డే)'ను ప్రతి ఏటా 15 మే రోజున పాటించుటకు నిర్ణయం తీసుకుంది. సమాజానికి యూనిట్ కుటుంబమని, కుటుంబ అభివృద్ధే సమాజ అభివృద్ధిని నమ్మిన ఐరాస ప్రతి ఏటా ఒక ప్రత్యేక నినాదంతో ఈ దినోత్సవాన్ని జరుపుకొనుట ఆనవాయితీగా మారింది. అంతర్జాతీయ కుటుంబ దినం – 2023 నినాదంగా 'జనాభా పోకడలు – కుటుంబాలు (డెమోగ్రఫిక్ ట్రెండ్స్ అండ్ ఫామిలీస్)' అనే అంశాన్ని తీసుకున్నారు. తల్లితండ్రులు తమ పిల్లల సమగ్రాభివృద్ధికి జీవితాలను ధార పోస్తారు.

## కుటుంబాభివృద్ధే దేశాభివృద్ధి:

చిన్నారుల శారీరక మానసిక విలాసానికి కుటుంబ వాతావరణం దోహదపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా మానవాళి ఎదుర్కొంటున్న పేదరికం, నిరక్షరాస్యత, అవిద్య, నిరుద్యోగాల వంటి సవాళ్ళను అధిగమించడానికి కుటుంబ వ్యక్తులు ప్రధాన కారకులు అవుతారు. కుటుంబ అభివృద్ధికి సాంఘీక, ఆర్థిక, జనాభా లాంటి అంశాలు ప్రభావితం చేస్తాయి. కుటుంబాన్ని బలీయం చేసినపుడు సమాజం నెలకొన్న అన్ని సమస్యలు సమిసిపోతాయి. కుటుంబ సభ్యుల్లో అమ్మనాన్నల మధ్య బంధం, పిల్లలతో ప్రేమానురాగాల సంబంధం, పిల్లల మధ్య సోదర రక్తసంబంధాలు పటిష్టంగా నెలకొని ఉంటాయి. అంతర్జాతీయ కుటుంబ దినం వేదికగా వ్యక్తి సమగ్రాభివృద్ధిలో కుటుంబాల ప్రాధాన్యతలను వివరించడం, కుటుంబ సభ్యులు కలిసి ఆటపాటలతో సంతోషంగా గడపడం, విభేదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవడం లాంటివి పాటిస్తారు. సమాజాభివృద్ధికి కుటుంబమే సోపానంగా నిలుస్తుంది. కుటుంబ విచ్ఛిన్నంతో కుటుంబ సభ్యుల మనసులు విరిగినట్లు భావించాలి. ఉన్నత విలువలు, సామాజిక సంఘీభావాలకు కుటుంబ వ్యవస్థ అతి ప్రధానమైనది. కుటుంబాల ప్రగతికి ప్రభుత్వాలు కూడా ప్రధాన భూమికను నిర్వహించాలి.

## భారతీయ ఉమ్మడి కుటుంబ భావన:

భారతీయ కుటుంబ వ్యవస్థలో ఉమ్మడి కుటుంబాల సంస్కృతి ప్రధానమైనది. ఒకే కుటుంబంలో 3 – 4 తరాల సభ్యులు (తాతలు, బామ్మలు, బాబాయిలు, పిన్నులు, మనుమలు, మనుమరాండ్రు, సోదర సోదరీమణులు, బావలు, మరదులు లాంటి సమీప సంబంధీకులు) ఒకే గొడుగు కింద కుటుంబ సభ్యులుగా జీవించగలగడం ఓ అపురూప భావన. మన దేశంలో నాటి పాతరాతి యుగం నుంచి నేటి డిజిటల్–నానో యుగం వరకు కుటుంబ వ్యవస్థలో కాలానుగుణంగా వస్తున్న మార్పులతో ఉమ్మడి కుటుంబాలు, న్యూక్లియర్ ఫామిలీలు, సరళ కుటుంబాలు భాగమై ఉన్నాయి. వీటికి తోడు నేటి ఆధునిక యుగంలో ప్రేమజంటల సహజీవనాలు, సింగిల్ పేరంట్ కుటుంబాలు, పిల్లలు లేని కుటుంబాలు లాంటి విపరీత వ్యవస్థలు కూడా రావడం విచారకరం. భారతీయ సగటు కుటుంబంలో 4 – 5 (కుటుంబ పరిమాణం 4.6) సభ్యులు ఉంటున్నారు.

## భారతీయ కుటుంబ పునాదులు:

భారతీయ కుటుంబ పుణాదులుగా విధేయత, సమగ్రత, ఐక్యత గుర్తించబడినవి. భారతదేశంలోని దాదాపు 140 కోట్ల జనాభాతో 25 కోట్ల కుటుంబాలు ఉన్నాయని అంచనా. వీటిలో 20 కోట్లు హిందూ, 3 కోట్ల ముస్లిమ్, 6.3 మిలియన్ల క్రిస్టియన్, 4.1 మిలియన్ల సిక్కు, 1.9 మిలియన్ల జైనులకా పాటు ఇతర మతాలకు చెందిన కుటుంబాలు ఉన్నాయి. భారత్‌లో పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, విద్య, మహిళాసాధికారత, పాశ్చాత్య ధోరిణి, వివాహ వ్యవస్థలో మార్పులు, సామాజిక విలువల్లో మార్పులు, వ్యవసాయ, గ్రామిణ పరిశ్రమలు తగ్గడం లాంటి ప్రధాన కారణాలతో కుటుంబ వ్యవస్థల్లో పెను మార్పులు వస్తున్నాయి. స్వల్ప విభేదాలతో విడిపోవడంతే సింగిల్ ఫాదర్ లేదా సింగిల్ మదర్‌తో పిల్లలు ఎదగడం లాంటివని భారతీయ కుటుంబ వ్యవస్థను పరిహాసం చేస్తున్నాయి.

నేటి పిల్లలే రేపటి తల్లితండ్రులని మరువరాదు. న్యూక్లియర్, సింగిల్ పేరంట్ కుటుంబాలు పెరుగుతున్న డిజిటల్ కాలంలో పిల్లలకు సామాజిక అవగాహన, పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసం జరగడం లేదు. పిల్లల్లో పేరెంట్స్ పట్ల నిర్లక్ష్యం, చులకన భావం పెరిగి, అనేక దురలవాట్ల నడుమ సంఘ వ్యతిరేక శక్తులుగా మారే ప్రమాదకర దుస్థితిలో భారత సమాజం నేడు ఉన్నది. కుటుంబాలను సౌభాగ్య కోవెలలుగా, అమ్మనాన్నల్ని ఆది దేవతలుగా భావిస్తూ, భరతమాత నుదుట సంతోష తిలకం దిద్దుదాం. కుటుంబ విలువలకు కలకాలం పట్టం కడుతూ గృహాన్ని స్వర్గ సీమగా



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# అంకుర సంస్థల పోషణ, పురోగతిని అనుసరించడానికి త్వరలో ఒక యంత్రాంగాన్ని అభివృద్ధి చేయాలి-డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, మే15:అంకుర సంస్థల సంఖ్య లక్షకు పైగా పెరగడంతో వాటి పోషణ, పురోగతిని అనుసరించడానికి త్వరలో ఒక యంత్రాంగాన్ని అభివృద్ధి చేయాలని కేంద్ర శాస్త్ర, సాంకేతిక, భూ విజ్ఞాన శాఖ సహాయ మంత్రి (ఇంచార్జ్), ప్రధానమంత్రి కార్యాలయం, అంతరిక్ష, అణుశక్తి శాఖ, డి.ఓ.పి.టి. శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రతిపాదించారు.

ఈరోజు న్యూ ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో జరిగిన నేషనల్ టెక్నాలజీ వీక్ ఎక్స్‌పోజిషన్ ముగింపు కార్యక్రమం, అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ప్రసంగిస్తూ, "ఈ అంకుర సంస్థల వృద్ధిని నిశితంగా అనుసరించే యంత్రాంగాన్ని అభివృద్ధి చేయాలని, ముఖ్యంగా ప్రభుత్వం నుండి సాంకేతిక, ఆర్థిక సహాయాన్ని పొందిన అంకురసంస్థలు కోరుతున్నాయి. వారు నష్టపోకుండా వాటిని ఎలా నిలబెట్టుకోవాలో చూడండి."అని సూచించారు.

కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మూడో తరం, సముద్ర శాస్త్రంలో కొత్త అవకాశాలు అందుబాటులోకి రావడంతో ఐ.టి. నుండి బయోటెక్, భూ విజ్ఞాన శాస్త్రం వైపు మారడం జరిగిందని, చెప్పారు.

''ఈ 3వ తరం అత్యంత అదృష్టవంతులు, వారు ఇకపై 'వారి ఆకాంక్షల ఖైదీలు కాదు" అని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొంటూ, "ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ క్రియాశీల నాయకత్వంలో ఆవిష్కరణలకు సాక్ష్యంగా భారతదేశం ముందంజలో ఉన్న ఉత్తమ సమయాలలో ఇది ఒకటి." అని వ్యాఖ్యానించారు.

అంకుర సంస్థల గురించిన అపోహలకు దూరంగా ఉండాలని డాక్టర్ జితేంద్ర సింగ్ సూచించారు. "ఒక కారణం వయస్సు, పదవీ విరమణ తర్వాత ఒక శాస్త్రవేత్త ఒక అంకుర సంస్థను ఏర్పాటు చేయడాన్ని నేను చూశాను; రెండవది అధిక అర్హత, మీరు సృజనాత్మకత కోసం అంతర్లీనమైన అన్వేషణను కలిగి ఉన్న ఒక ఆవిష్కర్తగా ఉండాలి," అని ఆయన ఉద్బోధించారు.

ఇతివృత్తం ఆధారంగా క్లస్టర్ ప్రాజెక్టులను నెలకొల్పాలని కూడా ప్రతిపాదిస్తూ, ఈ కసరత్తు వచ్చే వారంలో ప్రారంభమవుతుందని మంత్రి తెలిపారు. ఒక బ్రహ్మాండమైన ప్రదర్శన నిర్వహించేందుకు, 12 కంటే ఎక్కువ కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలను ఒక చోటకు తీసుకురావడం ద్వారా ప్రధానమంత్రి మోదీ రూపొందించిన "మొత్తం ప్రభుత్వం" అనే విధానానికి ఈ జాతీయ సాంకేతిక వారోత్సవాల కార్యక్రమం ఒక ఉదాహరణగా నిలిచిందని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారులు డాక్టర్ అజయ్ కుమార్ సూద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, భారతదేశానికి చెందిన జాతీయ సాంకేతిక దినోత్సవం, వారోత్సవాల మాదిరిగా, అంకుర సంస్థల దినోత్సవం, వారోత్సవాలను కూడా నిర్వహించాలని సూచించారు.

కేంద్ర శాస్త్ర, సాంకేతిక విభాగం కార్యదర్శి డాక్టర్ శ్రీవారి చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్రతి అంకుర సంస్థ సుస్థిర అభివృద్ధి గురించి చాలా స్పష్టమైన అవగాహనతో ఉన్నట్లు ఈ ప్రదర్శన సందర్భంగా ప్రత్యేకంగా చెప్పవచ్చునని పేర్కొంటూ, "అమృత కాల్ ద్వారా, మనం అన్ని గ్రీన్ హౌస్ ఉద్గారాలను నిలిపివేసి, పర్యావరణానికి హాని తగ్గించాలని ఆశిద్దాం." అని తమ ఆశాభావం వ్యక్తం చేశారు.

డి.బి.టి. కార్యదర్శి డాక్టర్ రాజేష్ గోఖలే మాట్లాడుతూ, సాంకేతిక విజ్ఞానం భవిష్యత్తు బయోటెక్నాలజీ, కృత్రిమ మేధస్సు ద్వారా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో – డి.ఆర్.డి.ఓ. చైర్మన్, డాక్టర్ సమీర్ వి. కామత్; ఎర్త్ సైన్సెస్ కార్యదర్శి డాక్టర్ ఎం. రామచంద్రన్; సాంకేతిక అభివృద్ధి మండలి కార్యదర్శి డాక్టర్ రాజేష్ కుమార్ పాఠక్; అటల్ ఇన్నోవేషన్ మిషన్, సి.ఈ.ఓ. డాక్టర్ చింతన్ వైష్ణవ్ కూడా ప్రసంగించారు.

ఈ సందర్భంగా డాక్టర్ జితేంద్ర సింగ్ జాతీయ సాంకేతిక అవార్డులను ప్రదానం చేశారు. మెయిన్; ఎం.ఎస్.ఎం.ఈ; స్టార్ట్–అప్; వినూత్న స్వదేశీ సాంకేతికత యొక్క విజయవంతమైన వాణిజ్యీకరణ కోసం వివిధ పరిశ్రమల నుంచి ట్రాన్సలేషనల్ రీసెర్చ్ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్; పరిశోధన, సాంకేతిక వ్యాపార ఇంక్యుబేటర్లలో పాల్గొన్న శాస్త్రవేత్తలు వంటి ఐదు విభాగాల కింద జాతీయ సాంకేతిక అవార్డుల కోసం, సాంకేతిక అభివృధి మండలి (టి.డి.బి) దరఖాస్తులు ఆహ్వానించింది. ప్రముఖ శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులతో కూడిన బృందంతో కఠినమైన రెండు– స్థాయిల్లో మూల్యాంకన ప్రక్రియ తర్వాత ఈ ఏడాది మొత్తం 11 మంది విజేతలను ఎంపిక చేయడం జరిగింది.

జాతీయ సాంకేతిక వారోత్సవాలను 2023 మే, 11వ తేదీన ప్రగతి మైదాన్ లో ప్రధానమంత్రి ప్రారంభించారు. భారత ప్రభుత్వంలోని 12 మంత్రిత్వ శాఖల నుంచి పలువురు ఆవిష్కర్తలు తాము రూపొందించిన విస్తృత శ్రేణి శాస్త్రీయ ఆవిష్కరణలను ప్రదర్శించారు.

''ఆవిష్కరణల కోసం యువ మేధస్సులను ప్రేరేపించడం – పాఠశాల నుంచి ప్రారంభం కావాలి" అనే ఇతివృత్తంతో ఈ ఏడాది కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఇందులో భారతదేశంలోని వివిధ పాఠశాలల నుండి భారత ప్రభుత్వ అటల్ ఇన్నోవేషన్ మిషన్ కింద అటల్ టింకరింగ్ ల్యాబ్స్ లో నిమగ్నమై ఉన్న విద్యార్థులు పాల్గొని తాము రూపొందించిన సాంకేతిక ఆవిష్కరణలు ప్రదర్శించారు.

సాంకేతిక అంకుర సంస్థలు, ఎస్.ఎం.ఈ. లకు మద్దతు ఇవ్వడంతో పాటు, వివిధ ప్రభుత్వ పథకాలు, ప్రోత్సాహకాల గురించి ఈ కార్యక్రమం అవగాహన కల్పించింది, దేశ వ్యాప్తంగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, సాంకేతిక ఔత్సాహికులను చేరుకోవడానికి ప్రయత్నించింది. సాంకేతిక పర్యావరణ వ్యవస్థలో వివిధ వాటాదారుల మధ్య పెరుగుతున్న సహకారం, భాగస్వామ్యాలను ఈ కార్యక్రమం ప్రోత్సహించింది. తమ ఆలోచనలను ఇచ్చిపుచ్చుకోడానికీ, తగిన అవకాశాలను అన్వేషించడానికీ, ఈ కార్యక్రమం వారిని ఒక చోటకి చేర్చింది.

రాబోయే 25 సంవత్సరాలలో సాంకేతిక నైపుణ్యం దిశగా జాతీయ సాంకేతిక వారోత్సవం ఖచ్చితమైన లక్ష్యాలను నిర్దేశించింది.

భారతదేశం అమృత్ కాల్ లోకి ప్రవేశించినందున, తదుపరి తరం ఆవిష్కర్తలు, వ్యవస్థాపకులను ప్రోత్సహించి, మద్దతు ఇచ్చే బలమైన ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థను నిర్మించడంపై కీలక దృష్టి ఉంది. మనం పరిశోధన మరియు అభివృద్ధిలో పెట్టుబడి పెట్టవలసిన అవసరం ఉంది.

మన మేధో సంపత్తి పరిపాలనను బలోపేతం చేసి, ఆవిష్కరణలతో పాటు, వృద్ధిని ప్రోత్సహించే విధాన వాతావరణాన్ని సృష్టించాలి. సరైన మద్దతు, ప్రోత్సాహంతో, భారతదేశం ప్రపంచంలో అత్యుత్తమమైన వాటితో పోటీ పడగల నిజమైన ప్రపంచ–స్థాయి సాంకేతిక పర్యావరణ వ్యవస్థగా అభివృద్ధి చెందుతుంది.

భారతదేశం యొక్క శాస్త్ర, సాంకేతిక పురోగతి కోసం పనిచేసిన వారితో పాటు, 1998 మే నెలలో పోఖ్రాన్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించిన భారతీయ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులను గౌరవించడం కోసం 1999 లో మాజీ ప్రధాని శ్రీ అటల్ బిహారీ వాజపేయి ఈ జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని జరుపుకోవడం ప్రారంభించారు. అప్పటి నుండి, ప్రతి సంవత్సరం మే నెల 11వ తేదీన జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.

# కడప కొండాపురం దగ్గర ఘోర రోడ్డు ప్రమాదం ఏడుగురు మృతి



కడప మే 15 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: జిల్లాలోని కొండాపురం దగ్గర ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తుఫాన్ వాహనాన్ని లారీఢీకొన్న ప్రమాదంలో ఏడుగురు మృతి చెందగా మరో ఆరుగురికి గాయాలయ్యాయి. తుఫాన్ వాహనంలో తిరుమల నుంచి తాడిపత్రి వెళ్తుండగా ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం సమయంలో తుఫాన్ వాహనంలో 13 మంది వున్నారు. మృతులు తాడిపత్రి, బళ్లారికి చెందినవారుగా గుర్తించారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

# అరాచక సర్కార్‌పై 'జనచైత్రయాత్ర'

అమరావతి మే 15 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర నేటితో వందవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వంద రోజుల విశేషాలతో టీడీపీ నేత కేశినేని శివనాథ్ (చిన్ని) రూపొందించిన ప్రత్యేక సంచికను లోకేష్ ఆవిష్కరించారు. యువగళం పాదయాత్ర అరాచక సర్కారుపై జనచైత్రయాత్రగా చరిత్రలో నిలిచిపోతుందని టీడీపీ నేతలు పేర్కొన్నారు. లోకేష్ చేపట్టిన యువగళం వందరోజులు పూర్తయిన సందర్భంగా పాదయాత్ర విశేషాలతో కేశినేని శివనాథ్(చిన్ని) ప్రత్యేక సంచిక తీసుకొచ్చారు. శ్రీశైలం నియోజకవర్గం బోయరేవుల క్యాంప్ సైట్ వద్ద సోమవారం ఉదయం యువనేత నారా లోకేష్ ప్రత్యేక సంచిక "జనహృదయమైనారా లోకేష్"ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, మాజీ మంత్రి రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర యాదవ్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగో పాల్ రెడ్డి, శ్రీశైలం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ బుడ్డా రాజశేఖర్ రెడ్డి, టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎంఎస్ రాజు, దూండి రాకేష్, యువగళం మీడియా కోఆర్డినేటర్ బీవీ.వెంకట రాముడు, భాష్యం ప్రవీణ్, పాల్గొన్నారు.

# వంద రోజులకు చేరుకున్న లోకేష్ యువగళం పాదయాత్ర

– పాదయాత్రలో పాల్గొన్న భువనేశ్వరి, నారా బ్రాహ్మణి



నంద్యాల మే 15 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: నేడు శ్రీశైలం నియోజకవర్గంలో నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ప్రారంభమైంది. నేటితో యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకోనుంది. జనవరి 27న చిత్తూరు జిల్లా కుప్పంలో పాదయాత్ర ప్రారంభమైంది. పాదయాత్రలో తల్లి భువనేశ్వరి సహా నారా, నందమూరి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. బోయరేవుల నుంచి పాదయాత్ర ప్రారంభమైంది. ముత్తుకూరు, పెద్ద దేవళాపురం, సంతజూటూరు, పరమటూరు మీదుగా బండి ఆత్మకూరు వరకు పాదయాత్ర సాగనుంది. సంతజూటూరులో చెంచులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించనున్నారు. యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా భారీగా కార్యకర్తలు, అభిమానులతో ఉత్సాహంగా ముందుకు సాగుతున్నారు. జైలోకేష్, జై తెలుగుదేశం నినాదాలతో యువగళం పాదయాత్ర మార్గం హోరెత్తుతోంది. పెద్దఎత్తున అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చారు. దాంతో 3 కి.మీ. మేర ట్రాఫిక్ స్థంభించింది. బాణాసంచా మోతలు, డప్పుల చప్పుళ్లు, నినాదాల హోరుతో జాతరను యువగళం తలపిస్తుస్తోంది.

# "భారతదేశంలో విద్యుత్ మార్కెట్ అభివృద్ధి" కోసం విద్యుత్ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన గ్రూప్ కీలక సమస్యలను పరిష్కరించడానికి అవసరమైన సమగ్ర పరిష్కారాలు

